ఇది కదా అభివృద్ధి

ఆరోగ్యవనం



ప్రాణవాయువు ఇచ్చే చెట్ల కింద కూర్చునేందుకు ఏర్పాటు చేసిన బల్లలు



బుచ్చిరాజుపాలెంలోని పంచతత్వ పార్కు

నాడు: ఒకప్పుడు నగరంలో **పార్కులు పిచ్చి** మొక్కలతో దర్శనమిచ్చేవి. **వీటి అభివృద్ధిని** నాటి పాలకులు విస్మరించడ**ంతో అసాం**ఘిక కార్యక్రమాలకు అడ్డాగా **ఉండేవి.** పార్కుల్లో నిలబడే పరిస్థితి లేక, పిల్లలతో వీకెండ్‌లో సరదాగా గడిపే అవకాశం లేక ఎన్‌ఏడీ ఏరియా నుంచి బీచ్ ఒడ్డుకో, వుడా పార్కుకో వెళ్లాల్సిన పరిస్థితులు ఉండేవి.

నేడు: గతంలో ఎన్నడూ లేని రీతిలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నగరంలో పార్కుల అభివృద్ధికి పెద్దపీట వేసింది. వీటిని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దింది. ఆహ్లాదకరమైన వాతావరణంతో పార్కులు అభివృద్ధి చేసింది. వ్యాయామానికి అవసరమైన పరికరాలు ఏర్పాటు చేసింది. అందుబాటులో ఉండడంతో ఇంటిల్లిపాది వాటిలో సేదతీరుతున్నారు. అందమైన పార్కులు 'ఆరోగ్య వనా'లుగా మారుతున్నాయి.

- ఆయుష్షు పెంచనున్న పంచతత్వ పార్కు
- రూ.20 లక్షలతో పార్కు అభివృద్ధి
- రూ.9 లక్షలతో ఉద్యానవనాల ఏర్పాటు
- ప్రజారోగ్యానికి పెద్దపీట
- ప్రారంభానికి సిద్ధం

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డులోని బుచ్చిరాజుపాలెంలోని 'పంచతత్వ పార్కు' అభివృద్ధిపై జీవీఎంసీ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. బుచ్చిరాజుపాలెం, ఏపీఎస్‌ఈబీ కాలనీ, లక్ష్మీనగర్ కాలనీ వాసుల ఉపయోగార్థం దీన్నిరూ.20 లక్షలతో అభివృద్ధి చేశారు. పార్కుకు వచ్చే వారి అవసరాలకు అనుగుణంగా మౌలిక సౌకర్యాలు కల్పించారు. ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా పార్కును తీర్చిదిద్దటంతో పాటు, వాకింగ్ ట్రాక్ సైతం ఏర్పాటు చేశారు. పార్కు పరిరక్షణలో భాగంగా చుట్టూ కాంపౌడ్ వాల్‌ను పటిష్టం చేసి, దానికి గేటు ఏర్పాటు చేశారు. ప్రజానీకం పార్కును ఉపయోగించుకునేందుకు వీలుగా తగిన ఏర్పాట్లు చేశారు.

రూ.9 లక్షలతో ఉద్యానవన మొక్కలు

ఎకో వైజాగ్ పేరిట కాలుష్య రహిత నగరం కోసం పక్కా కార్యాచరణతో ముందుకెళ్తున్న జీవీఎంసీ అధికారులు పార్కులను అభివృద్ధి చేయడంతో పాటు ఉద్యాన వనాలుగా తీర్చిదిద్దుతున్నారు. ఈ నేపథ్యంలోనే బుచ్చిరాజుపాలెంలో పంచతత్వ పార్కును రూ.20 లక్షలతో అభివృద్ధి చేశారు. దీనికి కొనసాగింపుగా మరో రూ.9 లక్షలతో పార్కులో ఆరోగ్యం పంచే మొక్కలు నాటారు.

సంరక్షణ అందరి బాధ్యత

పంచతత్వపార్కులో వివిధ రకాల ఉద్యాన మొక్కలు ఉన్నాయి. పార్కు మధ్యలో పన్నెండు నక్షత్రాల పేర్లతో రింగ్ ఏర్పాటు చేశారు. ఔషధ గుణాలు కలిగిన పలు మొక్కలు వేశారు. మరో పన్నెండు రకాల ఔషధ గుణాలు కలిగిన మొక్కలు నాటేందుకు అంతా సిద్ధం చేశారు. పార్కు ప్రాధాన్యత దృష్ట్యా మొక్కల సంరక్షణ, నిర్వహణ బాధ్యతను సమీప కాలనీ అసోసియేషన్‌కు అప్పగించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

ఆరోగ్యానికి మేలు చేసేలా

ఆరోగ్యానికి మేలు చేసే ఔషధ గుణాలు కలిగిన మొక్కలను పంచతత్వ పార్కులో నాటారు. తులసి, అలోవేరా, రణపాల, నిమ్మగడ్డి, వాముఆకు ఇలా వివిధ రకాల మొక్కలు ఇక్కడ ఉన్నాయి. పార్కు ప్రాంగణంలో వేప, రావి, కాడమల్లి ఇలా ప్రాణ వాయుకు రక్షణగా నిలిచే మొక్కలు నాటారు. వీటి మధ్యనే వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేశారు.

ప్రాణవాయువు పంచేలా..



మా ఇంటికి దగ్గరలోనే అందమైన పార్కు ఏర్పాటు చేయడం హర్షణీయం. గతంలో దీని గురించి ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. కానీ ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత పార్కును అభివృద్ధి చేశారు. పంచతత్వ పార్కుకు వెళితే ప్రశాతంగా ఉంటుంది. ప్రాణవాయువు ఇచ్చేలా అభివృద్ధి చేయడం సంతోషంగా ఉంది.

– సత్యవతి, లక్ష్మీనగర్ కాలనీ

ఎన్నో ప్రత్యేకతలు



అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగకరంగా ఉండేలా ప్రభుత్వం పనులు చేస్తోంది. జీవీఎంసీ అధికారులు ప్రజావసరాలకు అనుగుణంగా పార్కు అభివృద్ధి చేశారు. ఈ పార్కులో ప్రజారోగ్యానికి పెద్దపీట వేశారు. ఔషధ మొక్కలతో పాటు ఆక్సిజన్ ఇచ్చే మొక్కలు నాటారు. ఎంతో ప్రత్యేకతతో కూడిన పంచతత్వ పార్కును అభివృద్ధి చేయడం వల్ల అన్ని వర్గాల వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

– నమ్మి శ్రీను, 90వ వార్డు నాయకుడు

పార్కు అభివృద్ధి చేయడం హర్షణీయం



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజారోగ్యానికి ఎంతో ప్రాధాన్యం ఇస్తుంది. కాలుష్య నివారణకు ఇలాంటి పార్కులు ఎంతో దోహదపడతాయి. భవిష్యత్‌లో మంచి ఫలితాలు ఉంటాయి. ప్రజలకు ఆహ్లాదరకమైన వాతావరణం అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో పార్కులు అభివృద్ధి చేస్తుండడం హర్షణీయం.

– విల్లా సత్య నారాయణ రావు, ఏపీఎస్‌ఈబీ కాలనీ



ఏపుగా పెరిగిన వాము మొక్కలు



పచ్చని మొక్కల మధ్య ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్



పార్కులో ఏర్పాటు చేసిన తులసి వనం

క్లుప్తంగా

పార్టీ బలోపేతానికి కృషి



సమావేశమైన నాయకులు

సింధియా: కేంద్ర పథకాలను ప్రజలకు వివరించి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్రరెడ్డి సూచించారు. జీవీఎంసీ 63వ వార్డుకు చెందిన ఆ పార్టీ ముఖ్య నాయకులతో ఆదివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రజల సమస్యలపై స్పందించి వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లడం ద్వారా పార్టీ బలోపేతం అవుతుందన్నారు. సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి గంగయ్య, ఉభయ గోదావరి జిల్లాల ఎస్సీ మోర్చా జోనల్ ఇన్‌చార్జి ములకలపల్లి ప్రకాష్, 63వ వార్డు అధ్యక్షుడు రాజారావు, మల్కాపురం మండలాధ్యక్షుడు యల్లబిల్లి వెంకటరావు, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

ఈఎస్‌ఐ డాక్టర్ కేవీఎస్ గౌరీశ్వరరావు



విశాఖ విద్య: ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందే వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని మర్రిపాలెం ఈఎస్‌ఐ వైద్యుడు కేవీఎస్ గౌరీశ్వరరావు సూచించారు. ఈఎస్‌ఐ ఆస్పత్రి ద్వారా కార్మికులకు మెరుగైన వైద్యం అందించేలా కృషి చేస్తున్నామన్నారు. ఆదివారం ఆయన సాక్షితో మాట్లాడుతూ ప్రభుత్వాస్పత్రుల్లో గతంలో కన్నా వసతులు బాగా మెరుగుపడ్డాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వడం వల్ల భవిష్యత్‌లో మెరుగైన ఫలితాలు చూడొచ్చన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సివిల్ ఆస్పత్రులు, జిల్లా కేంద్ర ఆస్పత్రుల్లో ఏర్పడే ఖాళీలను భర్తీ చేయాలంటే గతంలో ఎంతో సమయం పట్టేదన్నారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం వైద్యులు, పారామెడికల్ సిబ్బంది ఖాళీల ఏర్పడిన వెంటనే భర్తీ చేసుకునేలా వెసులుబాటు కల్పించడం అనేది గొప్ప విషయమన్నారు. ఆస్పత్రుల్లో మౌలిక సౌకర్యాలు కల్పించడంతో నిపుణులైన వైద్యులు అందుబాటులో ఉన్నందున రోగులు వారి సేవలను వినియోగించుకోవాలన్నారు. ఈఎస్‌ఐ ఆస్పత్రిలో నాణ్యమైన మందులు ఉన్నాయని, అవసరమైన కార్మికులు తగిన గుర్తింపు కార్డుతో వచ్చి సేవలు పొందాలన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సుధ

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం యాదవ వీధిలో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ ఆదివారం స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. వార్డు పర్యటనలో భాగంగా ఆమె పలు ప్రాంతాలకు ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దీనిలో భాగంగా యాదవ వీధిలో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. నాణ్యత లోపించరాదని సూచించారు. కార్యక్రమంలో వార్డు పార్టీ నాయకులు,గృహసారథులు, సచివాలయాల కన్వీనర్లు పాల్గొన్నారు.

పిచ్చుకలను పరిరక్షించాలి

ఏయూ క్యాంపస్: ప్రకృతిలో అత్యంత విలువైన చిన్న జీవి పిచ్చుకను కాపాడి పర్యావరణ సమతుల్యతకు కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ మార్కెటింగ్ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి చిరంజీవి చౌదరి కోరారు. ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో జరుగుతున్న ఆర్గానిక్ మేళాలో భాగంగా సత్య ఆర్గానిక్స్ నిర్వహించారు. వరికంకుల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ఆదివారం ప్రారంభించారు.

ఎస్సీ,ఎస్టీలకు సముచిత స్థానం



పారిశ్రామిక ప్రాంత ఎస్సీ,ఎస్టీ సంఘ ప్రతినిధులు, సభ్యులతో మాట్లాడుతున్న ఆడారి ఆనంద్‌కుమార్

మల్కాపురం : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో ఎస్సీ,ఎస్టీలకు గుర్తింపు, ప్రాధాన్యత లభిస్తోందని, వచ్చే ఎన్నికల్లో పార్టీకి అండగా నిలవాలని ఏపీ సూక్ష్మ, చిన్న మధ్య తరహా ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. పారిశ్రామిక ప్రాంత ఏడు వార్డుల పరిధిలోని ఎస్సీ,ఎస్టీల సంఘాల ప్రతినిధులు, సభ్యులతో 59వ వార్డు నక్కవానిపాలెంలోని పార్టీ క్యాంప్ కార్యాలయంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. 62వ వార్డు కార్పొరేటర్ బల్లా లక్ష్మణరావు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆడారి ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ మంత్రి వర్గ విస్తరణతో పాటు రాష్ట్రంలో పలు నామినేటెడ్ పోస్టులలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎంత ప్రాధాన్యత ఇచ్చారో అందరికీ తెలుసునన్నారు. పేదలకు అండగా ఉంటూ పరిపాలన సాగిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ,ఎస్టీ సంఘ నాయకులు పూండి మల్లేశ్వరరావు, హనుమంతరావు, కొట్నాన రవి, బత్రి అప్పారావు పాల్గొన్నారు.

ముక్కోటి ఏకాదశికి పటిష్ట ఏర్పాట్లు



భాస్కరరెడ్డికి ఏర్పాట్లను వివరిస్తున్న దేవస్థానం ఈఈ శ్రీనివాసరాజు, ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: ఈనెల 23న ముక్కోటి ఏకాదశి సందర్భంగా సింహగిరిపై జరుగుతున్న ఏర్పాట్లను ఆదివారం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తితో కలిసి భీమిలి ఆర్డీవో భాస్కరరెడ్డి పరిశీలించారు. ఆరోజు ప్రముఖుల తాకిడి ఎక్కువగా ఉండే అవకాశం ఉంటుందని.. అందుకు తగ్గట్టు ఏర్పాట్లు చేయాలని సూచించారు. చందనోత్సవంలో ప్రముఖులకు సరైన ఏర్పాట్లు చేయలేదన్న అపవాదు రావడంతో ఈసారి ముక్కోటి ఏకాదశికి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రముఖుల దర్శనాల క్యూ ప్రత్యేకంగా ఏర్పాటు చేసి సాధారణ భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్టు ఈవో శ్రీనివాసమూర్తి తెలిపారు. వీఐపీలు దర్శనానికి వచ్చినప్పుడు దేవస్థానం, రెవెన్యూ అధికారుల మధ్య లైజనింగ్ ఉండేలా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో చినగదిలి తహసీల్దార్ రమణయ్య, దేవస్థానం ఈఈ శ్రీనివాసరాజు, ఏఈవో పాలూరి నరసింగరాజు పాల్గొన్నారు.

వైభవంగా ధనుర్మాస పూజలు



రామాలయంలో పూజలు చేస్తున్న మహిళలు



ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలందుకుంటున్న గోదా దేవి

మల్కాపురం: మార్గశిర, ధనుర్మాసం సందర్భంగా పారిశ్రామిక ప్రాంతంలోని రామాలయాలు,కృష్ణాలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. 61వ వార్డు నగరాలవీధి రామాలయంలో కొలువుదీరిన సీతా రామ లక్ష్మణ సమేత హనుమాన్‌కు భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు.అనంతరం లలిత పారాయణం పఠించారు. ఆలయ నిర్వాహకుడు భోగవల్లి నాగభూషణం ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.ఈ నెల రోజులు విష్ణుమూర్తికి ప్రీతికరమైన రోజులని,నిత్యం స్వామిని స్మరిస్తే సత్ఫలితాలు లభిస్తాయని పండితులు వివరించారు.

కొత్తపాలెంలో..

గోపాలపట్నం: ధనుర్మాసం ప్రారంభం కావడంతో మొదటి రోజు వైష్ణవాలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. ఇక్కడి కొత్తపాలెం ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ధనుర్మాస పూజలు నిర్వహించారు. వేంకటేశ్వరస్వామి, గోదాదేవి, శ్రీదేవిలకు అభిషేకాలు అర్చనలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు.

రక్తదానంతో మరొకరికి ప్రాణదానం

రెడ్‌క్రాస్ సెక్రటరీ రవి కుమార్



రక్తదాన శిబిరం ప్రారంభిస్తున్న రవికుమార్

విశాఖ విద్య: రక్తదానంతో మరొకరికి ప్రాణదానం చేసిన వారవుతారని ఇండియన్ రెడ్‌క్రాస్ సంస్థ కార్యదర్శి పి. రవికుమార్ అన్నారు. జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ షెల్టర్ వద్ద మమత చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ ఆపద సమయంలో రక్తం లభించక ఎంతో మంది ప్రాణాలు పోగొట్టుకుంటున్నారన్నారు. అలాంటి వారికి అండగా నిలవాలనే లక్ష్యంతో రెడ్ క్రాస్ సంస్థ ద్వారా నగరంలోని ప్రత్యేక రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. నగరంలోని వివిధ స్వచ్ఛంద సంస్థలు, పాఠశాలలు, కాలేజీ యాజమాన్యాలు రక్తదానంపై అవగాహన కల్పించేలా చొరవ చూపాలన్నారు. రక్తదానం చేసేందుకు ముందుకొస్తే తామే ప్రత్యేక వాహనంతో అక్కడికి వెళ్లి సేకరిస్తామన్నారు. మమత చారిటబుల్ సంస్థ నిర్వాహకురాలు ఎల్లేటి మమతను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఐహెచ్‌ఆర్‌సీ సెక్రటరీ రాజాన ప్రసాద్, మమత చారిటబుల్ సంస్థ ఫౌండర్ ఎల్లేటి మమత, మురళీ తదితరులు పాల్గొన్నారు.

సందడిగా ప్రీ క్రిస్మస్ వేడుకలు



అలరించిన సండే స్కూల్ చిన్నారుల నాటిక

గోపాలపట్నం: జీవీఎంసీ 91వ వార్డు జయప్రకాష్ నగర్‌లోని ఎరుషలేమ్ ప్రార్థనామందిరంలో ఆదివారం ప్రీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సంఘ కాపరి సిస్టర్ బ్లెస్సీ సండే స్కూల్ పిల్లలకు ఏసు క్రీస్తు జీవిత విశేషాలు వివరించారు. సండే స్కూల్ చిన్నారులు క్రీస్తుపై వేసిన పలు స్కిట్లు, పాటలు అలరించాయి. అనంతరం చిన్నారులకు కేకు పంచిపెట్టారు. కార్యక్రమంలో సండేస్కూల్ టీచర్లు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాల ఆవిష్కరణ



అంబేడ్కర్, జగ్జీవన్ రామ్ విగ్రహాల ఆవిష్కరణలో పాల్గొన్న సంఘ నాయకులు

గోపాలపట్నం: జీవీఎంసీ 91వ వార్డు పైడిమాంబ కాలనీ వద్ద డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలను శ్రీ తోట పోలమాంబ సేవా సంఘం, ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు నీళ్ల ఈశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం గ్రామ పెద్దలు, దళిత నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నీళ్ల ఈశర్వరరావు మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత, భారతీయులకు స్వేచ్ఛా వాయువులు అందించిన మహోన్నత వ్యక్తి డాక్టర్ బీ ఆర్ అంబేడ్కర్ అని కొనియాడారు. బాబూ జగ్జీవన్ రామ్ కేంద్ర మంత్రిగా ఉప ప్రధానిగా, సెంట్రల్ పార్లమెంట్ బోర్డు సభ్యుడిగా పలు కీలక పదవులు చేపట్టి దేశానికి ఎన్నో సేవలు అందించారని గుర్తు చేశారు. వారి విగ్రహాలు అందరి సహకారంతో ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి ఇడుగబల్లి ప్రసాద్, కోశాధికారి చెంగల వెంకటరావు, కుడితి సాధూరావు, మునపర్తి నాగేశ్వరరావు, చెంగల హరినాథ్, ప్రభాకరరరావు తదితరులు పాల్గొన్నారు.

స్విమ్మింగ్‌లో హాసినికి బంగారు పతకం



బంగారు పతకం అందుకుంటున్న హాసిని సముద్ర

గోపాలపట్నం: ఆక్వాటిక్ స్విమ్మింగ్‌లో ఆడారి హాసిని సముద్ర ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించింది. నరసారావుపేటలో శనివారం 9వ సబ్ జూనియర్, జూనియర్ ఆక్వాటిక్ అంతర్జాతీయ చాంపియన్‌షిప్ జరిగింది. ఈ పోటీల్లో 104 ఏరియా నేవీ చిల్డ్రన్ స్కూల్‌లో 7వ తరగతి చదువుతున్న హాసిని సముద్ర ప్రతిభ చూపి.. ఈ నెల 27 నుంచి 29 వరకు బెంగళూరులో జరగనున్న 34వ సౌత్ జోన్ ఆక్వాటిక్ చాంపియన్‌షిప్‌కు అర్హత సాధించింది. ఆమె తండ్రి గోపాలపట్నం సీఐ సంతోష్‌కుమార్. పాఠశాల ఉపాధ్యాయుడు వై.వి.కె. ప్రసాద్, వైశాఖీ స్విమ్మింగ్ పూల్ కోచ్ గిరడ రామారావు ఆమెను అభినందించారు.

భగవద్గీత శ్లోకాల పోటీల విజేతలకు బహుమతులు



బహుమతులు అందజేస్తున్న టీటీడీ ధర్మప్రచార పరిషత్ సూపరింటెండెంట్ చంద్రమౌళీశ్వరశర్మ

ఎంవీపీ కాలనీ : భగవద్గీతలోని శ్లోకాల కంఠస్థ పోటీల్లో విజేతలుగా నిలిచిన నగర యువతకు టీటీడీ ధర్మప్రచార పరిషత్ సూపరింటెండెంట్ చంద్రమౌళీశ్వరశర్మ బహుమతులు అందజేశారు. కర్మ యోగం, సంపూర్ణ భగవద్గీతపై ఆదివారం టీటీడీ ఆవరణలో నాలుగు కేటగిరీల్లో ఈ పోటీలు నిర్వహించారు. ఆయా కేటగిరీల్లో తొలి మూడు స్థానాలు సాధించిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సత్యకుమార్, రమాదేవి, సత్యనారాయణ, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అయ్యో.. పాపం

- వృద్ధుడిని వదిలించుకున్న కన్న పిల్లలు
- ఆదుకున్న జీవీఎంసీ ఏయూటీడీ సిబ్బంది



వృద్ధుడిని ప్రశ్నిస్తున్న ఏయూటీడీ సిబ్బంది

అల్లిపురం: వయసులో ఉన్నప్పుడు సంపాదించాడు. పిల్లలను పెంచి, పెద్ద చేశాడు. వారికి పెళ్లిళ్లు కూడా చేశాడు. ప్రస్తుతం ఆయన వయసు మళ్లింది. వయోభారంతో నడవలేని పరిస్థితిలో ఉన్నాడు. దీంతో పిల్లలు వదిలించుకోవాలనుకున్నారు. రెండు రోజుల కిందట రాత్రి సమయంలో ఆ వృద్ధుడిని తీసుకువచ్చి జగదాంబ జంక్షన్‌లో సీఎంఆర్ జ్యువెలరీ వద్ద వదిలిపెట్టి వెళ్లిపోయారు. రెండు రోజులుగా చలిలో కదల్లేని స్థితిలో పడి ఉన్న ఆ వృద్ధుడి విషయాన్ని తెలుసుకున్న భీమ్‌నగర్ ఏయూటీడీ నిరాశ్రయ వసతి గృహం మేనేజర్ జ్యోతిర్మయి, తన సిబ్బందితో వెళ్లి తీసుకువచ్చి ఆశ్రయం కల్పించారు. అతనికి సపర్యలు చేసిన అనంతరం వివరాలు అడిగి తెలుసుకున్నారు. తనది విజయనగరం గంట స్తంభం ప్రాంతమని ఆ వృద్ధుడు తెలియజేశారు